అవసరాల రామకృష్ణారావు కథలు. 5

తనో పేరు పొందిన సీరియల్ నవలా రచయితగా స్థిర పడగలనని మధుమూర్తి జన్మలో అనుకుని ఉండడు. పదేళ్ళ కిందట అతనికి ఉత్తరం రాయడంకూడా సరిగారాదు.

పోస్టు కార్డులో పెద్దపక్క నింపడానికే ఆ రోజుల్లో అతని తలప్రాణం తోకకి వచ్చేది.

'పెద్దలకి వందనములు. పిల్లలకి ఆశీస్సులు. అందర్నీ అడిగినట్లు చెప్ప కోర్తాను' ఇలాంటి రొడ్డుకొట్టుడు రోడ్డు రోలరు ముక్కలు తప్ప మరొకటి ఊడి పడేవికావు. చడీ చప్పుడు లేని చప్పిడి చచ్చు ఉత్తరాలని మించి అతని కలం మరి జరిగేదికాదు.

ఈ వ్యాపార ప్రపంచంలో వాడుకోడం తెలిసి చావాలిగాని ఎవరి అర్హతలు వారివి. మైనాకి కంఠం ఉండే రైనోకి ఖడ్గం ఉంది. ఇంతు ప్రపంచానికే సమర్థతలుండే జ్ఞానప్రపంచానికి చెందిన మధుమూర్తికా అపకీర్తి!

అతనిలో ఉన్న రెండు ప్రత్యేక యోగ్యతలు అతని దారిని సుగమం చేశాయి. ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేసే ఉద్యోగం అతనిది. రోజూ విధిగా ఇరవై పేజీలు తక్కువ కాకుండా తెలుగులో రాయాలి. ఆ విధంగా రచయిత కాకుండానే చెయ్యి తిరిగి పోయింది అతనికి. రెండోది, చాలామంది రచయితలకే లేనిది, అతని చేతిరాత చాలా పొందికగా ఉంటుంది. 'నీ రైటింగుకి నీ తలరాతకి చాలా దగ్గర సంబంధం ఉంటుంది సుమా!' అని ఎక్కడో చదివానుగాని స్వానుభవంలో తప్ప దాని స్వారస్యం అతనికి అవగత



మవలేదు.

"మనం గ్రహించక పోయి ఉండొచ్చుగాని ఇదివరకు ఇంకొకరు చెప్పనిదీ, ఇప్పుడు నీకు నవ్యంగా మొదటిసారి స్ఫురించేదీ ఇదివరకు లేదు. ఇక ముందు ఉండదు. జీవితంలో కొత్తేముంది, అదొక దర్శిత దర్పణం. సాహిత్యంలో ఏంతేముంది, అదొక చర్విత చర్వణం" అనే వివేచన అతన్ని కరదీపికలా ముందుకి నడిపించింది. "చీర ఒక్కటే కావచ్చు. చిన్నారికూడా ఒక్కతే కావచ్చు. కాని కట్టుకున్న తీరుని బట్టి ఆకట్టుకున్న పోజుని బట్టి" ఎప్పుడూ ఎరగని ఆడది సరికొత్త చీర కట్టుకున్నట్టుందే! అనిపించే అవకాశం లేదా! ఇన్నర్ వాల్యూ ఎవడిక్కావాలి, ఇంప్రెషన్ ముఖ్యం అనే ఇంగితం ఒంట పట్టగానే ఇక ఆగలేక పోయింది ఉరకలు వేసే ఆ యువక ప్రాణి. పిచిక గూళ్ళుగా మొదలై పిరమిడ్సుగా రూపు దిద్దుకుంటున్న యిటీవలి తెలుగు సుప్రసిద్ధుల మేలి రచనలు తిరగేస్తూంటే కొట్టొచ్చినట్టు ఒకటి కనపడిందతనికి "ఏ నవల అయినా ఏముంది, ఒక్కపాలు డొక్కశుద్ధీ, తొంభై తొమ్మిది పాళ్ళు జబ్బపుష్టి!" అంతే. మెలుకువని ఆకళింపు చేసుకోగానే రయ్యమని సాహిత్య రంగ ప్రవేశం చేసేశాడు మధుమూర్తి.

కథకి ఇంతని కిడుతుందని ఎప్పుడైతే పోల్చుకున్నాడో

"కథలు రాయనేల, కక్కూర్తి పడనేల? నవల రాసి వేలు నంజుకోండు" అనే కిటుకు కిటికీ తెరిచేశాడు. "ప్రేమిస్తే దాన్నో దీన్నో ఎందుకు సినీతారనే ప్రేమించేద్దాం" అనుకున్నట్టు, అతని మొదటి నవల "రెండోదే మొదటి ప్రైజుకి తగినది" అనే పేరుగల రచనని. అనన్య ప్రచారంగల వారపత్రిక "ఆంధ్రుల ఆరవ పడుచు" దీపావళి నవలల పోటీకి పంపించాడు.

మధుమూర్తి పనిచేస్తున్న మహానగరంలోనే ఉంది ఆ పత్రిక కార్యాలయం. దీపావళి ఇంక నెల ఉందనగా అక్కణ్నించి అతనికి ఓ రోజు టెలిఫోన్ పిలుపు అతని సాహితీ జీవితంలో ఒక మరువలేని మలుపు. రెండోకంటివాడికి తెలీకుండా ఆ సాయంత్రం వచ్చి రహస్యంగా కలుసుకోమని వారి ఆదేశం. గుండె పట్టుకుని అక్కడికి చేరిన మధుమూర్తికి వారు చెప్పిన వర్తమానం ఉన్నగుండె ఇక ఉలకదేమో అన్నంత ఉత్కంఠ కలిగించింది. అతని నవలకి రెండో ప్రైయిజు ఇస్తారట, వాళ్ళుచెప్పిన రూల్సుకి ఒప్పుకుంటే. అతను పెట్టిన పేరుమార్చి 'కోనలగుండెల్లో కోటి కో[illegible]క్కలు'గా ఉంచాలి. రెండోబహుమతిగా ప్రకటించబడిన అయిదువేల రొక్కం అతనికి యివ్వరుగాని అందుకున్నట్టు స్టాంపుమీద సంతకంచేసి ఇవ్వాలి. అయితేనేం అతని ఫొటో, జీవిత విశేషాలూ, అతనెలా ఇస్తే అలాగే ప్రచురిస్తారు. పాఠకులు రచయిత సందేశంకోసం ఎదురుచూడరా, అదీ వేస్తారు. అంతేనా, పదహారు వారాలపాటు ధారావాహికంగా బొమ్మలతో ప్రచురిస్తారు,

ఇది ఎవరికైనా తెలిసిందో..." రాయడానికి చేతులుమాట దేవుడెరుగు. ముందు

ఇంటికి చేరడానికి కాళ్ళు మిగలవు. అని జవాబుగా గుర్తించాడు మధుమూర్తి! రాత రమ్యంగా మలచుకోగల స్థాయికి అప్పటికే చేరుకున్న మధుమూర్తిలోని బతకనేర్చిన లక్షణం అతన్ని ఆలశ్యం చెయ్యనివ్వలేదు. అప్పటికప్పుడే వాళ్ళు కోరినట్టు రాసిచ్చేశాడు.

అన్ని పత్రికల్నీ ఆదేనీచస్థాయికి దిగజార్చి ఊహించే దుస్థితికి అతనెప్పుడూ చేరలేదుగాని "ఒకటీ మూడూ ప్రైజులు కూడా ఇలాంటివేనా?" అనే చిరుప్రశ్న మొలగజ్జిలా అతన్ని ఓ పట్టాన వదల్లేదుగాని, "కొన్ని కొన్ని తెలుసుకోపోడంలోనే ఉంది కొండంత జ్ఞానం" అనే వివేకశిఖరాన్ని అతిత్వరలోనే చేరుకున్నాడు. ఇంతకీ "ఆంధ్రుల ఆడపడుచు పత్రికలవాళ్ళు ఎంతో దూరదృష్టి గలవాళ్ళు. డబ్బు అనేది మబ్బులాంటిది. ఇట్టేవస్తుంది అట్టే మాయమవుతుంది. కీర్తి అనేదే అసలైన పెట్టుబడి. రికరింగ్ డిపాజిట్ అది. అది ఓ సారి చేజిక్కించుకుంటే "తనవెంటన్ సిరి..." అని అదే వచ్చిపడుతుంది. చేనుకోత పూర్తికాకుండానే పంటబేరం ఫైసలయినట్టు సీరియల్ పూర్తి కాకుండానే ఎందరో పబ్లిషర్లు అడ్వాన్సు నిధులిచ్చి మధుమూర్తి నవల తన్నుకుపోడానికి తన్నుకు చచ్చారు. ఇక ఎదురేముంది? రెండేళ్ళలో మరో మూడునవలలు సంపుటీకరించి మార్కెటీకరించి గొప్పనవలాకారుడై కూచున్నాడు మధుమూర్తి. నవల అనే "జిగ్ జిగ్ జిల"లో అనీ అందుకుని తర్జుమా అనే ఎగ్జిమా ఉద్యోగానికి ఎగనామం పెట్టేశాడు ఎప్పుడో

పెరిగిన తం ఆర్థిక పరిపుష్టి మనిషిని పారమార్థిక దృష్టికి మళ్ళిస్తుందేమో మరి! ఈమధ్య ఒకటి రెండేళ్ళ మధుమూర్తిలో కూడా జనసమ్మతం మాట అలా ఉంచి మనం చేస్తున్నది మనసమ్మతమేనా అని మనోమథనం లాంటిది బయల్దేరింది. నాలుగు సీరియల్స్ ఒకే సారి నడిపే కమర్షియల్ క్రాఫ్ని కాదన్నాడని కాదుగాని రచయితగా తనబాధ్యతంటూ ఒకటి ఏడిసిందేమో అన్న చింత అప్పుడప్పుడతన్ని బాధించేది. ఇవి కాకుండా ఓ సారి తన స్వగ్రామంలో తనకి సన్మానం జరిగినప్పుడు చిన్నప్పటి మేష్టారు సీతాపతిగారిని కలుసుకోడం మరింతగా అతన్ని అంతర్ముఖున్ని చేసింది. అయిదేళ్ళప్పుడే మధుమూర్తి తండ్రిపోతే వాళ్ళమ్మ నానాకష్టాలూపడి అతన్ని పెంచింది. ఒకేఒక్క కొడుకుగనక సహజంగా ఎంతో గారాబంగా చూసుకొనేది. పదేళ్ళు దగ్గరపడుతున్నా కొడుక్కి అక్షరంముక్క అబ్బకపోతే సీతాపతిగారికి అప్పజెప్పింది. నయానో భయానో తనకి దగ్గిరుండి చదువు చెప్పించింది ఆయనే. అందులో ఆయన పాతకాలపు తెలుగుమేష్టారు అవడంచేత అక్షరక్రమ లో ఏ ఒక్క తప్పువచ్చినా ఒప్పుకోక క్షుణ్ణంగా భాష తీరుతెన్నులు నేర్పించారు. అన్నం పెట్టిన అమ్మ పోయిందిగాని అక్షభిక్ష పెట్టిన ఆనాటి అయ్యవారు ఈనాడు ఎదురుపడితే... ఇన్నాళ్ళూ ఆయన మాటే మరిచిపోయి [illegible] టి.ఎస్.ఏ వేషంలో ఉన్న గజదొంగలా గడగడ వణికి పోయింది మధుమూర్తి మనసు.

ఆ ఆత్మీయుణ్ణి ప్రత్యేకంగా తనుబస చేసిన హోటలుకి పిలిపించి పట్టుబట్టలతో

సత్కరిస్తేగాని అతను ఊరుకోలేక పోయాడు.

'ఇంత ఉన్నతస్థితికి ఎదిగినా నన్ను గుర్తుంచుకుని అభిమానించావు అదేచాలు ఇవన్నీ ఎందుకు బాబూ!"

అంటూనే సీతాపతిగారు అవన్నీ ఆప్యాయంగా అందుకున్నారు.

"అంతా మీఆశీర్వాదబలం మేష్టారూ అంటూ 'ఈమధ్య మళ్ళీ కొత్త తెలుగు పద్యాలు ఏమైనారాశారా?' అనిఅడిగాడు.

'ఇంకా ఈ రోజుల్లోకూడా పద్యాలే రాయమన్నావా మధూ!' అంటూమేష్టారు మధుమూర్తి కలలోనైనా ఊహించని సంగతి ఒకటి బయటపెట్టేరు. సంచి లోంచి ఓ పెద్ద బౌండుపుస్తకం అతని చేతికిచ్చారు. ఇస్తూ అన్నారు.

'పాపులర్ రైటర్స్‌లో పటిష్టమైన స్థానం సంపాదించావు, నీ వల్ల ఈ ఉపకారం జరుగుతుందేమో అనే ఆశతో దీన్ని నీ దగ్గిరకి తీసుకొచ్చాను.'

మధుమూర్తి లోపల చూశాడు. 'నేతచీర' ఆ నవలపేరు. రచయిత బహుజనపల్లి సీతాపతి. రెండు లైన్లు చదవగానే తెలిసింది అది గ్రాంధిక భాషలో నడచిన పద్యకావ్యం కాదనీ, వ్యవహారిక భాషలో నడచిన వచన రచన అనీ. రెండువైపులా పదునుఉన్న ఆ ప్రతిభాశాలి నైపుణికి ఆ క్షణమే జోహారుచేసింది అతని మనసు. అతని విస్మయానికి విఘాతం కలిగిస్తూ మేష్టారు అన్నారు.

"చూడుమధూ? పుస్తకాన్ని కావ్యకన్యక అనే పేరుపెట్టిన మనవాళ్ళదూరదృష్టికి నాకెంతో ఆశ్చర్యం వేస్తుంది. మనసుకి అలజడి కలిగించి బయటపడే దాకా అల్లరిపెట్టే మానసపుత్రికలు ఈ కల్పనా ఖండికలు. అమ్మాయిని కనకుండా ఉండాలేగాని కని యుక్తవయసు వచ్చాక ఓ అయ్యచేతిలో పెట్టాలని ఉండడం కన్నవారికి సర్వసహజం. అత్తారింట్లో అది నలుగురితోనూ కలిసిపోయి అందరిచేతా అవుననిపించుకుంటే విని ఆనందించాలని ఉండడం అత్యాశ కాదు కదా! మరి వర్తక దృక్పథంలో పడి మనుషుల మనసులు అదెంత బండబారి పోయాయో ఆడపిల్ల పెళ్ళికావడమే అసాధ్యమైపోతోందయ్యా మధూ!"

'అదేమిటి మేష్టారూ, మీకుఆడపిల్లలు లేరుగా!'

"అదేమిటయ్యా దుకంత నాకూతురు నీ చేతిలో ఉంటేగా!" అప్రయత్నంగా తన నోటివెంట వచ్చిన పొరపాటు ప్రశ్నని పెద్దనవ్వుతో కప్పిపుచ్చాడు మధుమూర్తి. ఆయన ఇంకా ఇలా అన్నారు.

"అయినేళ్ళై ప్రయత్నిస్తున్నాను. మా 'నేతచీర'కి వెలుగుచూసే గీత ఉన్నట్టు కనిపించలేదు. కనీసం పది పత్రికాఫీసుల నుంచయినా తిరిగొచ్చి ఉంటుంది ఇది. ఎలా పంపబడింది అలా కాగితం అయినా నలగకుండా. మాయకుండా తిరిగివచ్చేసింది. దీన్ని నీ ద్వారా ఏదైనా పత్రికలో నిముషాలమీద సీరియలైజ్ చేయించేస్తావనే దురాశకాదు. నేను ఆ రోజుల్లో మనిషినికదా, ఈ రోజుల్లో పనికివచ్చేవి ఏవి లేవో, ఏ లోపాలు ఉన్నాయో.... నీకేమాత్రం లీజరున్నా ఓన్నోసారి ఈ రాత్రికిచూసి రేపొద్దున్న ఎలాఉందో ఏంచెయ్యాలో చెబుతావని"

అని మరి మాటాడకుండా వెళ్ళిపోయారు సీతాపతి మేష్టారు.

ఆయన్ని వెళ్ళనిచ్చి, లోపల తలుపు గడియపెట్టుకుని, తలగడ మీదకి తల చేర్చి గుండెలమీద ఆ పుస్తకం విప్పి కళ్ళెదుట పరుచుకోడం మాత్రమే గుర్తుంది మధుమూర్తికి. పేరుకి పేజీలు జరుగుతున్నాయి, ఎడమనుంచి కుడికీ. పైనుంచి కిందకీ కంటి చూపు కదులుతోంది. పైకి తెస్తున్నది అంతే. అతని హృదంతరాళాలలో కలుగుతున్న అనుభూతి మాత్రం ఊహ్యంకాదు, భాష్యం లేదు! అది చదివిన ఆ మూడు గంటలసేపూ తనెవరో ఎక్కడున్నాడో తెలియనంతగా మైమరచి పోయాడు. అందులో పాత్రలు తనకెంతో సన్నిహితమైనట్టూ ఆ భాష తనకి తెలిసినవారు తనకి అర్థమయే పద్ధతిలో మాటాడినట్టూ అందులో చిత్రితమైన హ్యూమన్ నేచరూ, అంతర్వాహినిగా ఆద్యంతం ప్రవహించిన హ్యూమరూ తనని కదిలించి కరిగించేటట్టూ ఉన్నాయి. మధ్య తరగతి జీవితాన్ని ఉన్నదున్నట్టు చెప్పిన, నిండు గుండె విప్పి పరచిన నిజాయతీ ప్రయత్నం అది. అప్పటికప్పుడు, ఆ అర్ధరాత్రివేళ టాక్సీ మీద మేష్టారింటికి వెళ్ళి ఆ పుస్తకాన్ని భద్రంగా ఆయన చేతికి తిరిగి అప్ప చెప్పేదాకా మధుమూర్తికి మనశ్శాంతి చేకూరలేదు. గద్గదిక కంఠంతో గురువుకి చేయబడిన శిష్యోపదేశం యిదీ:

'మేష్టారు! ఎన్నాళ్ళకోగాని ఇంత గొప్ప తెలుగు పుస్తకం చదివే అవకాశం దొరకదు. కృతజ్ఞుణ్ణి. నేను గుర్తించినంతవరకు మన తెలుగు సాహిత్యం, ముఖ్యంగా నవల అనే ప్రక్రియ ఈనాడు రోగ భూయిష్టమైఉంది. నా అనుభవం నాకు చెప్పిన పాఠాలు ఏమిటంటే యీ రోగాలు ఒకటీ రెండూ కావని. బీ పి.తో, అంటే భూతాలతో పాములతో; ఎఫ్ పి. తో, అంటే ఫాంటసీలతో పులులతో; ఏ.డీ.తో, అంటే వనితల దొంగపేర్లతో, టీ.బీ.తో అంటే తీయని భ్రమలతో, మంచాన పడిఉంది మన సరస్వతి. అన్నీ అంతే కాక పోవచ్చుగాని ఎక్కువగా ఇలాంటి రచనల్నే చదివి తరిస్తున్నాడు ఆంధ్ర మహా పాఠకుడు. ఇక మీకు రాసిన పేజీలు అంటారా, అందులో కిక్కులు లేవు, క్లిక్కులు లేవు, ట్రిక్కులు లేవు, టెక్కు నిక్కుల కుమ్మక్కు అయిన టెక్నిక్కులు లేవు! ఎక్కడ బాగులేదో చెప్పమన్నారు. ఇంత బాగా రాయడం కంటే యీ రోజుల్లో మరో తప్పు ఉండటండీ? బొత్తిగా భూమ్మీద మనుషుల కష్టసుఖాలే రాస్తే ఎలా! ఏ ఎర్రసిరా గుర్తులూ అందర్లైన్లూలేక మీ అమ్మాయి మీ ఇల్లు చేరింది సంతోషించండి. చల్లని బీరు అలవాటైనచోట చిక్కనిపాలు సప్లై చేస్తే ఎలా!

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.